
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024
5
తిరుపతి



నేటితో ముగియనున్న పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) అనర్హుత పింఛన్ల ఏరివేతకు రాష్ట్ర ప్రభుత్వం పైలట్ కమిటీ ప్రాజెక్టు రూపొందించింది. తిరుపతి జీవకోన ప్రాంత సెక్రటేరియట్ పరిధిలో 354 పింఛన్‌దారులకు గాను 322 మందిని పరిశీలించారు. సోమవారం పరిశీలన ముగిసే సమయానికి 32 మందిని ఇంకనూ పరిశీలించాల్సి ఉందని డిఆర్డిఏ పిడి శోభన్ బాబు తెలిపారు. జరిగిన రెండు రోజుల పింఛన్దారుల పరిశీలన కార్యక్రమంలో 15 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. 9 బందాలు ఒక బృందానికి ఇద్దరు చొప్పున ప్రతి బృందం 40 మంది పింఛన్దారులను తనిఖీ చేసిందన్నారు. పరిశీలనలో శ్రీకాళహస్తి డి.ఎల్.డి.ఓ సుష్మిత రెడ్డి, డిఆర్డిఏ పీడి శోభన్ బాబు తనిఖీ బృందాలను పర్యవేక్షించారు. డిపిఎం మాధవి, ఈఓఆర్డి ప్రభు, ఏవో పిచ్చి రెడ్డి, పంచాయతి సెక్రటరీ రాధిక తనిఖీ నిర్వహించారు. ప్రస్తుతం 90.09 శాతం తనిఖీ పూర్తి చేశామన్నారు. మిగిలిన 32 మందిలో ఒకరు మరణించారని, 31 మంది వేరువేరు ప్రాంతాల్లో ఉన్నారని, మంగళవారం తనిఖీ ప్రారంభమయ్యే సమయానికి వారి చిరునామా గల నివాసాల వద్దకు చేరుకోవాలని సూచించామని తెలిపారు.

చాపకింద నీరులా...చలికాలంలో..
'సర్దు' 'పోటు'



అదనపు భారాలతో దర్జాగా దోపిడీ
వినియోగదారులపై 'కూటమి' కుట్ర
తిరుపతి జిల్లాపై 23-30 కోట్ల భారం

విద్యుత్ భారాల తీరు పరిశీలిస్తే 'ఏడు చేపల కథ' గుర్తుకొస్తుంది.. జగన్ హయాంలో విద్యుత్ ఛార్జీలు ఎందుకు పెంచారని అడిగితే 'ఈ పాపం నాది కాదు చంద్రబాబుది' అని చెప్పారు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ హయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. 'ఈ భారం జగన్ చేసిన పాపం' అని చెబుతున్నారు. వాస్తవం ఏమంటే విద్యుత్ వినియోగదారులపై 'సర్దుబాటు' ఛార్జీల పేరుతో ప్రతి నెలా వాయించేస్తున్నారు.. అది కూడా వినియోగదారుల నుంచి వ్యతిరేకత రాకుండా.. చలికాలంలో విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుందని 'సర్దుపోటు'ను చాపకింద నీరులా ప్రారంభించారు.. జాగ్రత్తగా పరిశీలిస్తే తప్ప 'భారాల' కుట్ర వినియోగదారులకు అర్థం కాదు.. పూర్తిగా అర్థం కావాలంటే ఫిబ్రవరి నెల ఎండాకాలం రావాల్సిందే. అప్పుడు స్టార్ట్ అవుతుంది ఎండ తీవ్రతతో పాటు, విద్యుత్ ఛార్జీల అదనపు మోత. గతంలో ఎపుడో వాడిన కరెంట్‌కు సైతం అదనపు పేరుతో ఇప్పుడు ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నాయి. తిరుపతి జిల్లాలోనే ఒక్క నవంబర్ నెలలో 23-30 కోట్ల పైన అదనపు ఛార్జీల రూపంలో భారం పడనుందని 'ప్రజాశక్తి' పరిశీలనలో తేలింది

ప్రజాశక్తి - తిరుపతి సిటి

. కరెంట్ నిత్యావసరం అయిపోయింది. ఇళ్లల్లో వెలుగు రావాలన్నా, యంత్రాలు పనిచేయాలన్నా విద్యుత్ ఎంతో కీలకం. 'విద్యుత్ కొనుగోళ్లలో' అక్రమాలను వినియోగదారులపై భారాల పేరుతో మోపడం ప్రభుత్వాలకు అలవాటైపోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెబుతూనే అదనపు ఛార్జీల పేరుతో వినియోగదారుల వద్ద బలవంతంగా రాబడుతున్నాయి.

సాధారణ గృహాలకు సైతం యూనిట్‌కు 64పైసలు చొప్పన ఫుల్అండ్ పవర్ పర్చేజ్‌కాస్టు అడ్జస్టుమెంట్ (ఎఫ్‌ఏపిపిసిఏ) పేరుతో రెండు రకాలుగా డిసెంబరు నుంచి వసూళ్లకు తెరలేపాయి. తిరుపతి జిల్లాలో నెలకు 23 కోట్ల నుంచి 30 కోట్ల రూపాయలు నవంబరు నెల విద్యుత్ వినియోగం కంటే అదనంగా వసూళ్లు చేస్తున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 10,94,828 గృహ విద్యుత్ కనెక్షన్లు, హెచ్‌టి 1130 కనెక్షన్లు, రైతులకు 1,46,618 కనెక్షన్లు, ఎస్‌సి, ఎస్‌టిలకు 1,42,717 ఉచిత కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత శీతాకాలంలో ప్రతి రోజూ 14 నుంచి 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. వేసవికాలంలో ఇది కాస్త 19 నుంచి 20 మిలియన్ యూనిట్ల సరాసరిగా వినియోగం అవుతుంది. డిసెంబరు నెల విద్యుత్ బిల్లులకు 2022 నవంబరు నెలలో వినియోగంపై ఎఫ్‌ఏపిపిసిఏ చార్జీలు, 2024 పదో నెల ఎఫ్‌పిపిసిఏ చార్జీలను అదనంగా వసూళ్లు చేస్తున్నారు. రెండు చార్జీలు కలిపి యూనిట్‌కు సరాసరి 64 పైసలు చొప్పున ఇంధనం, విద్యుత్ కొనుగోలు ఖర్చు పేరుతో సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తున్నారు.

వినియోగదారులను మభ్యపెట్టే ప్రయత్నం

వినియోగదారులను మభ్యపెట్టేందుకు మరొక పద్ధతిని అనుసరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లులలో 20శాతం బిల్లులు గత నెల కంటే తక్కువ మొత్తం, లేదా అంతే మొత్తాన్ని వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 1 నుంచి 7వ తేదీ లోపు కరెంట్ బిల్లులు తీస్తుంటారు. వాస్తవానికి ప్రతి నెలా 7వ తేదీ తీసే కరెంట్ బిల్లును డిసెంబరులో ఒకటో తేదికే కొన్ని బిల్లులు తీయడంతో 20 నుంచి 30 యూనిట్లు గత నెలకంటే తక్కువ వినియోగం చూపుతుంది. దీంతో గృహవినియోగం బిల్లుల్లో 60 నుంచి 80 రూపాయలు తక్కువ ఛార్జీ చూపుతుంది. దీన్ని సాకుగా చూపి డిస్కంలు వినియోగదారులను మభ్య పెట్టేలా ముందుకెళ్లడం కొసమెరుపు.

ఎవరో వాడిన దానికి నేను కట్టడం ఏంటో..: స్వప్న, ల్యాబ్ నిర్వాహకురాలు, తిరుపతి



గత ఆరు నెలలుగా శివజ్యోతినగర్‌లో ల్యాబ్ నడుపుతున్నాను. తెల్లవారి మూడు గంటలు, సాయంత్రం నాలుగు గంటలు మాత్రమే కరెంట్ వినియోగం ఉంటుంది. గత ఐదు నెలలుగా ప్రతి నెలా రూ.650 నుంచి రూ.780 వరకు వచ్చేది. డిసెంబరు నెలలో ఏకంగా రూ.1030 వచ్చింది. ఇదేమని ప్రశ్నిస్తే గత ఏడాది నవంబరులో వాడినిదానికి అదనంగా చెల్లించాలని ఉంది. ఎఫ్‌పిపిసిఏ 2022 నవంబరు రూ.45.52, ఎఫ్‌పిపిసిఏ 2024 నవంబరు అదనపు చార్జీ రూ.36.80, కస్టమర్ చార్జీ రూ.40, ఎలక్ట్రిసిటి డ్యూటీ రూ.99, ట్రూఆఫ్ చార్జీలు రూ.19.50గా వసూలు చేశారు. ఎవరో వాడిన దానికి మేము అదనంగా 200 రూపాయలకు పైగా చెల్లించాల్సి రావడం బాధాకరం.

గత నెల కంటే రూ.280 అదనం : లాల్తురామ్, బోండాల అంగడి, తిరుమల బైపాస్



గత 10 సంవత్సరాలుగా తెల్లవారి, సాయంత్రం పూట బోండాల అంగడి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. పాప డిగ్రీ, బాబు ఇంటర్ చదువుతున్నాడు. వడలు, బోండాలు అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతోనే జీవనం నడుస్తోంది. ఇంటి అద్దె 6వేలు, అంగడి అద్దె 4 వేల రూపాయలు నెలకు 10వేల రూపాయలు అద్దెలకే సరిపోతుంది. కుటుంబం పోషణ, పిల్లలు చదువులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు కరెంట్ చార్జీలు కూడా పెంచితే మా పరిస్థితి ఏంటి?


హీటర్ పెట్టాలంటే భయమేస్తుంది : పి.సునీత, గృహిణి, ఎస్ఆంజెస్‌జె కాలనీ

గత మూడు నెలలుగా వెయ్యి రూపాయల నుంచి 1100 కరెంట్ బిల్లు వచ్చేది. 3 నెలలకు ముందు నెలకు 700 నుంచి 850 రూపాయలు వచ్చేది. శీతాకాలం కావడంతో వేడినీళ్ల స్నానానికి పిల్లలకు హీటర్ వాడుతున్నాం. దీని వల్ల 1100 రూపాయలు వస్తుంది. డిసెంబరులో ఏకంగా 380 రూపాయలు అదనంగా వచ్చింది. హీటర్ వాడాలంటే భయమేస్తోంది.

సంపాదించింది కరెంట్‌కే సరిపోతోంది : బాబు, టైలర్, ఎర్రమిట్ట

గత 20 సంవత్సరాలుగా టైలర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. సాధారణ టైలరింగ్ మిషన్ వినియోగం వల్ల మోకాళ్ల నొప్పులు వస్తుండడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో కరెంట్ మిషన్ వాడుతున్నాను. గుడ్డలు కుట్టాలంటే కరెంట్ తప్పనిసరి. పెరిగిన ధరల వల్ల అదాయం అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పుడు కరెంట్ చార్జీలను కూడా ఇష్టారాజ్యంగా వసూలు చేస్తే, సంపాదనంతే దీనికే ధారపోయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించాలి.

వడ్డీలకే వడ్డీ వేస్తున్నారు : మహిపాల్ చౌదరి, కుదవవ్యాపారి, తుంబవానిగుంట స్కూల్ సందు, తిరుపతి.



కుటుంబ పోషణ కోసం రాజస్థాన్ నుంచి వలస వచ్చి తిరుపతిలో ఉన్నంతలో ఓ షాపును అద్దెకు తీసుకుని, కుదవ వ్యాపారం చేస్తున్నాను. అవసరమైన వారికి వారి వస్తువులను తాకట్టుపెట్టుకుని డబ్బులు ఇస్తున్నాను. వడ్డీల ద్వారా వచ్చే రూపాయి, రెండు రూపాయలతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. కరెంటోళ్లు వడ్డీలకే వడ్డీలు వేస్తూ, వడ్డీ వ్యాపారులనే మించి పోయాలా వ్యవహరిస్తుండడం దారుణం. ప్రభుత్వం కలగజేసుకుని, ప్రజలకు కరెంట్ భారాలు పడకుండా చూడాలి.

మతిస్థిమితం లేనివారికి 'ఆధార్' ఇవ్వండి

13 సార్లు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలిచ్చాం
పి.సైదమ్మ, ట్రస్టు నిర్వాహకురాలు, ఏర్పేడు



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

కలెక్టరేట్ వద్ద ప్రజా ఫిర్యాదుల వేదిక స్పందన ఎలా ఉంటుందో ఈ ఒక్క ఘటనను చూస్తే అర్థమవుతుంది. అధికారుల నిర్లక్ష్యమూ అద్దం పడుతుంది. మతిస్థిమితం లేని వారి సమస్యనూ పరిష్కరించలేదంటే ఎవరి సమస్యలను పరిష్కరిస్తున్నారో ప్రజలకు చెప్పాల్సి ఉంది. ఇప్పటికి 13సార్లు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇచ్చామని, అయినా సమస్య పరిష్కరించలేదని ఏర్పేడు తాలూకా వికృతమాల వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు పి. సైదమ్మ ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్‌ను కలిసేందుకు మతిస్థిమితం లేనివారు ప్రాంగణంలోనే అర్ధగంట సేపు రావాల్సి వచ్చింది. ఇది వారి దయనీయ పరిస్థితి. ఈ ట్రస్టులో దాదాపు 40 మంది ఉన్నారని, వారికి ఆధార్‌కార్డులు మంజూరు చేయాలన్నది వారి విజ్ఞప్తి. అయితే అధికారులు 13సార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని, ఆధార్‌కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాల లబ్దికి ఇబ్బంది పడుతున్నారని, చాలా విషయాల్లో ఆధార్ ఖచ్చితంగా అవసరమని ఆమె మీడియాకు తెలిపారు.

ప్రధాన సమస్యలు ఇవే...

– శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో కరోనా సమయంలో 24 మంది కార్మికులను విధుల్లోకి తీసుకొని, తరువాత పక్కన పెట్టారని, ఆ సందర్భంగా 6 నెలల జీతం కూడా పెండింగ్ ఉందని, పక్కన బెట్టిన కార్మికులను మళ్ళీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏఐటీయూసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. అలానే రేణిగుంట, దామల చెరువు గ్రామ పంచాయతీల్లో పారిశుద్య కార్మికులకు పిఎఫ్ నగదు జమపై గందరగోళంగా ఉందన్నారు.


– మంగళం పరిధిలోని ఎంపిపి పాఠశాల విద్యార్థులకు క్రీడామైదానాన్ని మంజూరు చేయ్యాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి వినతి ఇచ్చారు. ఎంతో కాలంగా క్రీడా మైదానం లేక విద్యార్థులు రోడ్లపై ఆటలాడు కొంటున్నారని వివరించారు. అలానే సత్యవేడులో ఎస్సీ హాస్టల్ శిధిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారి పెచ్చులు ఊడి పడు తున్నాయని వివరించారు. ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి బాల ఉన్నారు.

– శెట్టిపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయని, చిన్నపాటి వర్షానికే బురదమయంగా ఉన్నాయన్నారు. వీధిదీపాలు వెలగడం లేదని, తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి ఉప సర్పంచ్ రామకష్ణ, శంకర్ మాస్టర్, కష్ణవేణి, భువనేశ్వరి, యమునా, లక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అర్జీదారుల ఇక్కట్లు

అర్జీదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పెద్ద సంఖ్యలో అర్జీదారులు వస్తే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయకులు సరిపోక, సమయం దృష్ట్యా అర్జీదారులు పీజిఆర్ఎస్ రసీదు తీసుకోని అక్కడే నేలపై రాసి అధికారులకు ఇస్తున్నారు. అర్జీదారులు కూర్చుని రాసుకోవడానికి సౌకర్యవంతంగా బల్లలు ఏర్పాటు చేయాలని అర్జీదారులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌కు అర్జీదారులు 'క్యూ' జిల్లా నలుమూలల నుండి వివిద రకాల సమస్యలతో అర్జీలు చేతబట్టి వచ్చే అర్జీదారులకు అర్థవంతమైన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు క్యూకట్టారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. నేరుగా కలెక్టర్‌కే అర్జీలు ఇవ్వడానికి అర్జీదారులు పోటీపడ్డారు. పీజిఆర్ఎస్‌కు 183 అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌కు 34 వినతులు అందాయి. కమిషనర్ మౌర్య, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి- రేణిగుంట

కరకంబాడి పంచాయతీలో సోమవారం ప్రభుత్వం నిర్వహించిన 'రెవెన్యూ సదస్సు' లో సిపిఎం నాయకులు రాజశేఖర్, సెల్వరాజ్, సుజాతలు రేణిగుంట ఏర్పేడు మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్‌తో కలిసి రేణిగుంట మండల తాసిల్దార్ కు 'వినతి పత్రం' ఇచ్చారు. సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ.. తారకరామానగర్ లో ఇంటి స్థలాలు లేకుండా ఉన్న పేదలు వెయ్యి కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. కరకంబాడి ఎర్రగుట్ట భూమిని 126 ఎకరాలు పేదలందరికీ పంచి ఇంటి పట్టాలు ఇవ్వాలని, కరకంబాడి రెవెన్యూ లెక్క దాఖలాలో దాదాపు పదివేల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమి ఎవరి స్వాధీనంలో ఉందో తేల్చాల్సిన అవసరం రెవెన్యూ అధికారుల పైన ఉందని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కూల్ గ్రౌండ్ ఆక్రమణ దారులపై కేసులు పెట్టాలని, గ్రౌండ్‌ను పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సుందరయ్య కాలనీ ఏర్పడి దాదాపు 13 సంవత్సరాలుగా కూలీనాలి చేసుకునే పేదలందరూ సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించుకొని ఉన్నారని, ఆ ఇళ్లకు పట్టాలివ్వాలని, కరెంటు మీటర్లు ఇవ్వాలని, ఇంటి పన్ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరకంబాడి రెవెన్యూ లో ఉన్న అవకతవకలన్ని సరిచేయాలని కోరారు.

వైద్య అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా ఎస్ వి వైద్య కళాశాలలో వైద్య అధ్యాపకులకు, బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య కళాశాల మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం, తమిళనాడు సీ.ఎం.సి వేలూరు వైద్య కళాశాల వారి ఆధ్వర్యంలో డిసెంబర్ 09 నుండి 11 వరకు నిర్వహించబడునని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 30 మంది వైద్య అధ్యాపకులు వైద్య విద్య బోధనలో నూతన పద్ధతులు గురించి పూర్తి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.ఎస్.కిరీటి, సిఎంసి వేలూరు వైద్య కళాశాల (అబ్జర్వర్) పర్యవేక్షకులు డాక్టర్ రమ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి -రేణిగుంట

రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకట రత్నం ఆదేశానుసారం, పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు సూచన– సలహాల మేరకు ఇందిరా నగర్, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్‌ఆవరణలో సోమవారం రాస్ టాటా ట్రస్ట్ వారిచే, ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన మహిళలకు – పురుషులకు డాక్టర్ వెంకయ్య బాబు బృందం క్యాన్సర్ పై పూర్తి అవగాహన కల్పించి ,అందరూ అన్ని పరీక్షలను తప్పక చేసుకునే విధంగా ,వారి ఆరోగ్యం పై ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలను అందించారు. టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు బృందం,సిబ్బంది హేమంత్ కుమార్ ,రెడ్డికుమారి , అమరావతి , మహేంద్ర, రాస్ మహిళా జ్యోతి ట్రస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, అన్బలగన్ పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్-హిరోషిమా బృందం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

జపాన్‌లోని హిరోషిమా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. హిరోహరు సకనే నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, విభిన్న ఉత్పాదక రంగాలలో అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రంగా దీని సామర్థ్యం, ఇక్కడ పరిశ్రమలు స్థాపించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రదర్శన ద్వారా వారికి వివరించారు. 30కి పైగా జపనీస్ కంపెనీల స్థాపనతో భారతదేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా గుర్తింపు పొందడం శ్రీసిటీ ప్రత్యేకతగా ఆయన పేర్కొన్నారు.

'మన్నవరం'లో మిగిలిన భూమి ప్రభుత్వానికి అప్పగించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద ఎన్బిపిపిఎల్ కంపెనీకి కేటాయించిన భూములలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాలు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే నూతన పరిశ్రమల స్థాపనకు, వాటి అవసరాలకు కేటాయించుటకు అవకాశం ఉంటుందని శ్రీకాళహస్తి మన్నవరం ఎన్బీపీపీఎల్ ప్రతినిధులకు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ నుండి వర్చువల్ విధానంలో పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, ఎండి ఏపిఐఐసి అభిషిక్త కిషోర్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌లతో కలిసి ఎన్బిబీపీఎల్ పరిశ్రమల ప్రతినిధులతో వర్చువల్ విధానంలో సదరు పరిశ్రమలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాల అంశంపై సమీక్ష నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు స్పందిస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలో సదరు అంశం ఉందని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు 150 దుప్పట్లు పంపిణీ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పి.డబ్ల్యు ఫెడరేషన్ కె.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో సభ జరిగింది. రుయా ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ ముని మురళీధర్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆర్టీసీ డిఎం డాక్టర్ బాలాజీ, ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్టు నుంచి తహసున్నీసా బేగం విచ్చేసి 150 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నగరంలోని పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి ఆపరేషన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి పరిధిలోనీ 33/11 కె.వి. నార్త్ సెక్షన్‌లో సప్తగిరి నగర్ , శాంతి నగర్, ప్రశాంతి నగర్ పరిసరా ప్రాంతలలో 11 కె. వి. లైన్లు, ఎల్.టి. లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు, ట్రీ కటింగ్ వల్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీచైతన్యలో 'సేఫ్ ఇండియా'



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి బైరాగి పట్టెడలోని శ్రీ చైతన్య స్కూల్ ఐపిఎల్ బ్రాంచ్ లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల నుండి అన్నమయ్య సర్కిల్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ తమ గమ్యాలను సురక్షితంగా చేరుకోవాలని కోరారు. విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. విద్యార్థులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వాహనదారులను ఆపి రోజా పువ్వు, చాక్లెట్ ఇచ్చి హెల్మెట్ ధరించండి– కుటుంబాన్ని రక్షించండి అని ప్రేమ పూర్వకంగా చెప్పిన సన్నివేశం చూపరులను ఆకట్టుకుంది. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించిన విద్యార్థులను ఏజిఎం సురేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవిబాబు పాల్గొన్నారు.

11 నుంచి మార్కెట్లో 'స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

'ఫాస్టెస్ట్ స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13' డిసెంబర్ 11వ తేదీ నుంచి అందుబాటులో కలదని ఐక్యూ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిపున్ మరియా తెలిపారు. ఈ ఫ్లాగ్‌షిప్ పరికరం సాటిలేని పనితీరు, అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్‌తో ఉంటుందన్నారు. ఐక్యూ ధర 12జీబీ–256జీబీ వేరియంట్ రూ. 54,999 (సమర్థవంతమైన ధర 51,999), 16జీబీ–512జీబీ వేరియంట్ రూ. 59,999 (సమర్థవంతమైన ధర 56,999)లో ఉందన్నారు. ఇది రెండు రంగులలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. లెజెండ్, నార్డో గ్రే రంగులలో కలదు. నో–కాస్ట్ ఈఎంఐ, 9 నెలల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.



సేంద్రీయ ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సేంద్రీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సేంద్రీయ ఉత్పత్తుల విక్రయ కేంద్రంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లును కొనడానికి ఇటు అర్జీదారులతో పాటుగా జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు మొగ్గు చూపుతున్నారు. సోమవారం జిల్లా పర్యాటకశాఖాధికారి జనార్ధన్ రెడ్డి, ఇతర అధికారులు ఇక్కడి సేంద్రీయ ఉత్పత్తులను కోనుకోలు చేశారు. అలానే ఆంధ్రప్రదేశ్‌లో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి బెంగుళూరుకు చెందిన అజీజ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈఓ హైమావతి సోమవారం గ్రామీణ మహిళలు పండించిన సేంద్రీయ ఉత్పత్తులను పరిశీలించి కొనుగోలు చేశారు. ప్రతి ఏడు దాదాపుగా 100 కోట్ల రూపాయలు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి నిధులు ఇస్తున్నారని ఫౌండేషన్ సిబ్బంది తెలిపారు.



ఎస్వీయూ ప్రొఫెసర్ చెంచయ్యపై దాడికి పాల్పడిన భజరంగ్‌దళ్ రౌడీమూకలను అరెస్టు చేయాలంటూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వీసీ ఆచార్య అప్పారావుకు వినతి (వార్త జనరల్‌లో..)

గత పాలకుల వల్లే అగస్త్యేశ్వరాలయ దుస్థితి

టీడీపీ నేత కన్నలి ప్రతాప్ రెడ్డి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామంలో వెలసిన అగస్త్యేశ్వరాలయ దుస్థితికి గత వైసీపీ పాలకులే కారణమని టీడీపీ సీనియర్ నేత కన్నలి ప్రతాప్ రెడ్డి తెలిపారు. జీర్ణోద్ధరణ పేరుతో పైపై మెరుగులు దిద్ది కుంభాభిషేకం నిర్వహించి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దాని ఫలితంగానే ఈ రోజు చిన్నపాటి వర్షానికి సైతం స్లాబు నుంచి నీరు లీకేజీ అవుతోందని పేర్కొన్నారు. ఆగస్త్యేశ్వరాలయ జీర్ణోద్ధరణ పనులకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆ మేరకు పనులు చేపట్టిన వారు పైపై మెరుగులు దిద్దారే తప్ప ఆలయ మరమ్మతులు గురించి మాత్రం పట్టించుకోలేదన్నారు. అప్పటి ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. కానీ కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారని చెప్పారు. వారు ఆలయ విషయంలో తప్పుల చేసి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ విషయమై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆలయ గత కార్యనిర్వహణాధికారి విచారణకు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. సదరు అధికారి బదిలీపై వెళ్లడంతో విచారణ సాగలేదన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆగస్త్యేశ్వరాలయ స్లాబు నుంచి ఉరుపు వస్తోందని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తుల తరఫున ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. స్పందించిన ఆయన ఆలయ మరమ్మతులకు హామీ ఇచ్చారని తెలిపారు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనలో తన జోక్యమేమీ లేదన్నారు. ఆలయ టెండర్లు తన కనుసన్నల్లోనే జరుగుతున్నాయనేది అవాస్తవమని చెప్పారు. ఎక్కడ కూడా తాను కానీ తనకు సంబంధించిన వ్యక్తులకు కానీ టెండర్లను తీసుకోలేదనే వాస్తవాన్ని గ్రహించాలన్నారు. రాజకీయాల్లో ఉన్నప్పటికీ అధికారాన్ని ఉ వ యో గిం చు కొ ని దుర్వినియోగానికి ఎప్పుడూ ఎక్కడా పాల్పడలేదని స్పష్టం చేశారు. స్వతహాగా అట్టల పరిశ్రమను స్థాపించి స్థానికంగానే కాక పరిసర ప్రాంతాల వారికి ఉపాధి చూపుతున్నామని చెప్పారు. సాయం చేయడమే తప్ప తప్పులు చేసి ఏలెత్తి చూపించుకునే రకం కాదన్నారు. అయితే ఎటువంటి తప్పులు చేయకపోయినా చేసినట్లు చూపి వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలని సూచించారు. ఇకపై ఇటువంటి నిరాధర ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

12న జాబ్‌మేళా

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యభివృది సంస్థ అధికారి లోకనాధం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో ఐదవ తరగతి, పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8639835953 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

12న ఉచిత మెగా వైద్య శిబిరం


సమావేశంలో మాట్లాడుతున్న మీరారెడ్డి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: స్థానిక ముత్యాలపేటలోని పెల్లేటి రామిరెడ్డి క్లబ్ ఈనెల 12న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కోడూరు మీరారెడ్డి, సీనియర్ సభ్యుడు శ్రీకంటి రామ మోహన్‌రావు అన్నారు. సోమవారం స్థానిక పిఆర్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పట్టణ, పరిసర ప్రజలకు నెల్లూరుకి చెందిన కిమ్స్ (బొల్లినేని) సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దంత, కంటి, మెదడు, నరాలు తదితర అన్ని రకాల వ్యాధులకు వైద్యనిపుణలచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ. పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీధర్, నవీన్ జయకుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి ట్రాక్టర్ విరాళం


ట్రాక్టర్‌కు పూజలు చేస్తున్న కార్యదర్శి జయశంకర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ పంచాయతీకి సోమవారం టాఫే కంపెనీకి చెందిన ట్రాక్టర్‌ను ఆ కంపెనీ ప్రతినిధులు పంచాయతీ కార్యదర్శి జయశంకర్‌కు విరాళంగా అందించారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణకు, తాగునీటి అవసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పంచాయతీ కమిటీ అధ్యక్షులు జడారెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాభక్ష్, హరిబాబు, సుబ్బు, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం


దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-తిరుపతి మంగళం: మంగళం పరిధిలోని పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్లస్ పాఠశాల ప్రాంగణంలో సరస్వతి విగ్రహ ఏర్పాటుకు దాత నుంచి సాయం అందినట్లు హెచ్‌ఎం కేశవులు నాయుడు తెలిపారు. దాత విశ్వనాథ నాయుడు రూ.47,828 అందించి పనులు ప్రారంభించేందుకు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. 900 పైచిలుకు విద్యార్థులున్న మంగళం ట్రెండ్స్ పాఠశాలలో విగ్రహం ఏర్పాటుకు పాఠశాల యాజమాన్య కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణమనాయుడు చొరవతో దాత ముందుకు వచ్చారని, సోమవారం దాతకు ఉపాధ్యాయుల సమక్షంలో సన్మానం చేశామన్నారు. సరస్వతి విగ్రహ ఏర్పాటుకు వచ్చిన విరాళ డీడీని టీటీడీ శిల్ప కళాశాలకు అందజేశామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనం గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నేత అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన తెలుసుకొని వైసిపి మండల కన్వీనర్ ఆరని విద్యానాథరెడ్డి సోమవారం ఆ గ్రామానికి చేరుకున్నారు. వైసీపీ చింతపూడి విజయభాస్కర్ కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.2వేల ఆర్థిక సహాయం అందించారు.


వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని కొత్త శివగిరి గ్రామానికి చెందిన టిడిపి సర్పంచ్ మోహన్ నాయుడు కుమారుని పెళ్లి తమిళనాడు తిరువళ్లూరు కళ్యాణ మండపంలో ఈ నెల 5న జరిగింది. ఎమ్మెల్యే హాజరు కాలేనందున సోమవారం వారి స్వగ్రామం శివగిరిలో వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు ఇళంగోవ రెడ్డి, సర్పంచ్ పద్దు రాజు తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివ, కోమల, గిరి, మునికుమార్ పాల్గొన్నారు.


సీఐకి ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్ట్ సంఘాల నాయకులు


ఎంబియు గేటు వద్ద మీడియా ప్రతినిధులపై దౌర్జన్యం చేస్తున్న బౌన్సర్లు

మీడియా ప్రతినిధులపై దాడి

- కెమెరాలు, సెల్ ఫోన్లు ధ్వంసం
- గంట పాటు కళాశాలలో నిర్బంధం
- కిడ్నాప్‌నకు యత్నించిన ఎంబియూ బౌన్సర్లు
- చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేసిన జర్నలిస్ట్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని ఏ రంగంపేట సమీపంలోని మోహన్ బాబు విద్యాసంస్థల వద్ద మీడియా మిత్రులపైన బౌన్సర్లు దాడి చేయటం అమానుషమని తిరుపతి ప్రెస్‌క్లబ్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. సోమవారం మోహన్ బాబు విద్యాసంస్థల ముందు ప్రధాన రహదారిలో వీడియో కవరేజ్ చేస్తున్న ఓ టీవి కెమెరామెన్ రిపోర్టర్‌ల పైన కట్లు రాడ్లతో భౌతిక దాడి చేయడమే కాక వారి వద్ద నుంచి కెమెరాను సెల్ఫోన్లను లాక్కొని ధ్వంసం చేసిన సంఘటనను ఖండిస్తూ మీడియా నాయకులు చంద్రగిరి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. జరిగిన దాడిని నిరసిస్తూ చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డికి రాత మూలకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగు స్తంభమని అలాంటి మీడియా పైన దౌర్జన్యాలు చేయటం ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన రహదారిలో వీడియో కవరేజ్ చేస్తూ ఉంటే భౌతికంగా దాడి చేయడం ఏ మేరకు న్యాయమో మోహన్ బాబు విద్యాసంస్థల యాజమాన్యం ఆలోచించాలని చెప్పారు. విద్యాసంస్థల పీఆర్వోల ముందరే బౌన్సర్లు దాడికి దిగటం సహించరాని చర్యగా మీడియా మిత్రులు ఆక్షేపించారు.

దాడికి కారకులైన వారి పన కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మీడియా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.


ధ్వంసమైన కెమెరాలు

ఈ సంఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు నాయకులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు మురళి, మాజీ కార్యదర్శి కాళహస్తి గిరి, నాయకులు విజయ్ యాదవ్, నరేష్ రెడ్డి, బాదురు బాలయ్య, కార్తీక్, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ నాయకులు సభ్యులు, చంద్రగిరి, తిరుపతి మీడియా మిత్రులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టు వదలకుండా ప్రయోగాలు చేస్తూ ఉంటే తప్పకుండా విజయం సాధించవచ్చని విక్రమ సింహపురి యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కిరణ్మయి అన్నారు. మనకు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శాస్త్రవేత్తలు నిరూపించారని వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి విద్యార్థులు ప్రయోగాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. సోమవారం పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో జూనియర్ కళాశాల సాయి ఇంటర్ కాలేజీ గేట్ సైన్స్ ఎగ్జిబిట్ కాంపిటేషన్ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు వారి ప్రదర్శనలను ప్రదర్శించి పరిశీలకులకు తోటి విద్యార్థినిలకు వివరించారు.




ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకొని వారిలోని ప్రతిభను ప్రదర్శించేందుకు వేదికగా చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ యలవర్తి విద్యాసాగర్ రావు, ప్రిన్సిపాల్ హనుమంతరావు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు నూతన హంగులు

- ఏపీఈఆర్‌సి ఛైర్మన్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

ప్రజాశక్తి-రామచంద్రాపురం: విద్యుత్ రెగ్యులేటింగ్ కమిషన్ ఛైర్మన్ రామ్ సింగ్ 14న విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని కుప్పం బాదూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్‌పిడిసిఎల్ అధికారులు నూతన హంగులు దిద్దుతున్నారు. సబ్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ముళ్ళకంపలను, చెట్లను, రాతి గుండ్లు తొలగించారు. సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు, విద్యుత్ స్తంభాలకు సిల్వర్ పెయింటింగ్ వేసి, విద్యుత్ పరికరాలను, విద్యుత్ లైన్లను మరమ్మతు పనులలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఏపీఈఆర్‌సి ఛైర్మన్ పర్యటనను విజయవంతం చేసేందుకు ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆశీర్వాదం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిల ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను చురుకుగా సాగిస్తున్నారు.



ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటాం

- నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపుర్వకంగా కలిశారు. నాయకులు పలు స్థానిక అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి వాటిని నెరవేర్చేందుకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో జీవరత్నం నాయుడు, ధనపాల్, బాబు నాయుడు, కరీం బాయ్, ఖాజాపీర్, నబీ మస్తాన్, మహమ్మద్ రఫీ, అమీర్జాన్, ఖాసీం, జమిల్ నౌషద్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో నాయకులు

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం: టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రవణం విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టిటిడి ఛైర్మన్ సోమవారం శ్రవణం కేంద్రాన్ని, చిన్నారుల శిక్షణ తరగతులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ మాట్లాడుతూ, శ్రవణం కేంద్రంలోని విద్యార్థుల సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, చిన్నారులకు ప్రధాన సౌకర్యాలను త్వరలో కల్పిస్తామన్నారు. చిన్నారుల ఉంటున్న భవనం అక్కడక్కడా వర్షా కాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి తమ దృష్టికి తీసుకు వచ్చారని, త్వరలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. చిన్నారులకు వినికిడి యంత్రాలు సరఫరా చేయాలని, మరింతగా పౌష్టికాహారం అందించాలని వారి తల్లులు కోరారు. శ్రవణం భవనంలో అక్కడక్కడా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, తక్షణమే సాంకేతిక అంశాలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టిటిడి జేఈవో గౌతమి, శ్రవణం ఇన్‌ఛార్జ్ డాక్టర్ కిషోర్ కుమార్, టిటిడి ఎస్‌ఈ జగదీశ్వర్ రెడ్డి, ఏవీఎస్వో మోహన్ రెడ్డి, శ్రవణం ప్రెసిడెంట్ కనకదుర్గ, సెక్రటరీ పుష్పలత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను సోమవారం తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చిట్టిబాబు, రాం భూపాల్ రెడ్డి, మాంగాటి గోపాల్ రెడ్డి, శివశంకర్, సుప్రజ, జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: మాజీ ఏఐసిసి అధ్యక్షురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంచిపెట్టారు. పలు చోట్ల పేదలకు అన్నదానం చేశారు. విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పేదల కోసం ప్రాణాలు అర్పించి, ప్రజల కోసమే జీవిస్తున్న ఏకైక కుటుంబం గాంధీల కుటుంబమని దామోదరం రెడ్డి అన్నారు. కరీముల్లా, మునిరాజా, ఆంటోనీ, తిరుపాల్, రాహుల్, చిరంజీవి, ప్రభాస్, బాబు, సాయి, నవీన్, ధన, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తిలో

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏపిఎస్ ఆర్టీసి గూడూరు డిపో ఎదుట సోమవారం కండక్టర్, డ్రైవర్ల, అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమం సోమవారం ఐదవ రోజుకు చేరుకుంది. కార్యక్రమానికి డిపో సహాయ ప్రచార కార్యదర్శి కత్తి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ తిరుపతి రీజినల్ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి అక్రమ సస్పెన్షన్లను రద్దుచేసి ఉద్యోగులను విధులలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ సీనియర్ నాయకులు శేషయ్య, రాము, రమణయ్య, శీనయ్య, భాస్కర్, రవీంద్ర గ్యారేజీ సిబ్బంది, సిఐటియు గూడూరు పట్టణ కమిటీ నాయకులు సురేష్, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



జర్మనీ పర్యటనకు ఇన్‌ఛార్జ్ విసి

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య ఉమ వెన్నం జర్మనీ పర్యటనకు వెళ్లారు. ఈ నెల 8 నుంచి 14వరకు "ఉన్నత విద్య, సైన్స్ కో-ఆపరేషన్ సంస్థల సహకారం" అనే నేపథ్య యాత్రలో పాల్గొనేందుకు వెళ్లారు. 2024 ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ విజిటర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా జర్మనీ, వారి ప్రజల సంస్కృతి గురించి ఇతర దేశాల నుంచి వచ్చిన అతిథులతో కలిసి, ప్రత్యక్ష అనుభవం పొందేలన్నదే ఈ ట్రిప్ లక్ష్యం అన్నారు.

సదాశివ కోనకు వెళ్లే మార్గాన్ని పునరుద్ధరిస్తాం

- పంచాయతీ రాజ్ డీఈ వెంకటరమణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు పుత్తూరు మండలం తడుకు పంచాయతీ నుంచి సదాశివ కోనకు వెళ్లే మార్గం నాగిలేరు వద్ద దెబ్బతినడంతో ఆ మార్గాన్ని తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్‌తో కలిసి ఆయన మరమ్మతుకు గురైన రోడ్లను పరిశీలించారు. ఈ మార్గాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తామని పంచాయతీరాజ్ డిఇ తెలిపారు.


రోడ్లను పరిశీలిస్తున్న డీఈ

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



ప్రజాశక్తి-దొరవారిసత్రం: గ్రామ స్థాయిలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శైలకుమారి అన్నారు. సోమవారం మండలంలోని నెల్లూరుపల్లి పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, సర్పంచ్ గోపిరెడ్డి, ఆర్ఐ మోదుగుల ప్రవీణ్ రాయల్, వీఆర్వో రమేష్, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పంగూరు పంచాయితీలో తహశీల్దార్ భార్గవి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన 15 ఫిర్యాదులలో రికార్డు ఆఫ్ రైట్స్ -10, గవర్నమెంట్ అసైన్డ్ ల్యాండ్ -2, మీసేవ గ్రీవెన్స్ రెవెన్యూ సంబంధించి -3 ఫిర్యాదులు అందాయని తహశీల్దార్ తెలిపారు.

పుత్తూరు టౌన్: రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని ప్రజలు తమ భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని పుత్తూరు మాజీ ఎంపీపీ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. సోమవారం మండలంలోని గోపాలకృష్ణపురం పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో తహశీల్దార్ డీసీ వెంకటేశ్వర్లు, నాయకులు బాలాజీ, గజపతి తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలో జరగనున్న ఏడు గంగమ్మల జాతర పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఏఎస్పీ రవి మనోహరాచారి సోమవారం రాత్రి పరిశీలించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రం నుంచి అవసరమైన సహకారాన్ని శ్రీకాళహస్తి పోలీసులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. డీఎస్పీ నరసింహమూర్తి, వన్ టౌన్ సిఐ గోపి తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తడ: మండలంలోని మాంబట్టు సెజ్ అపాచి రోడ్డులో సోమవారం ఆగివున్న కంటైనర్ లారీని బైక్ పై వెళుతున్న తులసీ రావు(33) ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసు కథనం మేరకు.. తులసీ రావు సుమారుగా 8సంవత్సరాల నుంచి అపాచీ కంపెనీలో పనిచేస్తున్నారు. సూళ్లూరుపేట పాలవెల్లివారి వీధిలో నివాసం ఉంటూ సోమవారం కంపెనీకి వెళ్ళాడు. అనంతరం కంపెనీ నుంచి స్నేహితుని బైక్ తీసుకుని అపాచీ నుంచి నేషనల్ హైవే వైపు వెళుతుండగా వాల్ కేరో కంపెనీ వద్ద ప్రక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని వేగంగా వెనుక వైపు ఢీ కొట్టాడు. దీంతో తులసీ రావు తలకు బలమైన గాయమై రక్తం అధికంగా పోవడంతో అక్కడిక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న తడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

అనుమానాస్పదంగా యువతి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం (చంద్రగిరి): పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో చంద్రగిరి మండలం ముంగిలిపట్టు జాతీయ రహదారి బ్రిడ్జి పైన అనుమానాస్పదంగా తలపైన గాయంతో ఓ యువతి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 25 నుంచి 30 సంవత్సరాల లోపు వయసు కలిగిన యువతి తలకు బలమైన గాయం తగిలి రోడ్డు పక్కన పడి ఉండటం స్థానికుల గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పడివున్న ప్రదేశం చుట్టుపక్కల పరిశీలించారు. మృతురాలికి సంబంధించి గాని, మృతికి సంబంధించి గాని ఎలాంటి ఆధారాలు లభించలేదు. యువతి ప్రమాదవశాత్తు మృతి చెందిందా లేదా ఎవరైనా హత్య చేసి పడవేసి వెళ్లారా పోలీసుల పరిశీలనలో తెలియాల్సి ఉంది. చంద్రగిరి ఎస్ఐ అనిత అక్కడికి చేరుకొని యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భోజనాలు పంపిణీ


భోజనాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గూడూరు టౌన్: గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చంటి జ్ఞాపకార్థం మనపాటి శ్రీనివాసరావు దాతృత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు భోజనాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ షరీనా పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలకి భోజనాలు అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, ప్రభాకర్, ఆనంద్, సుబ్బారావు, మస్తాన్, జగదీష్, పవన్, సాయి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంతో మంచి ఆరోగ్యం

- సర్పంచ్ మోహనప్రియ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఎండి పుత్తూరు గ్రామంలో సర్పంచ్ మోహన ప్రియ ఆధ్వర్యంలో మురికి కాలువల వెంబడి బ్లీచింగ్ చల్లించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం ఆరోగ్యకరంగా ఉండాలంటే మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఆకతాయిల వీరంగం

- ఎన్‌టీఆర్ నగర్‌లో విద్యుత్‌కు అంతరాయం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలో ఎన్‌టీఆర్ నగర్‌లో ఆదివారం రాత్రి కొందరు ఆకతాయిలు వీరంగం సృష్టించారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను పలుమార్లు ఆపేస్తూ స్థానికులకు కరెంట్ కష్టాలు చూపించారు. 8 గంటల ప్రాంతంలో ఒకసారి, అర్ధరాత్రి వేళ మరో సారి ట్రాన్స్ ఫార్మర్‌ను ఆపేసి సుమారు రెండు గంటల పాటు స్థానికులకు చుక్కలు చూపించారు. దీంతో స్థానికులు ఆకతాయిలపై తిరగబడటంతో అక్కడ నుంచి పారిపోయారు. దీనిపై ఎస్పీడీసీఎల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళాలు వేసి చేతులు దులుపుకున్నారు.